క్లుప్తంగా

విరాళాలతో రోడ్డు నిర్మాణం


పెన్నానదిలో మట్టిరోడ్డు వేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి టక్కోలి వరకు పెన్నానదిలో రూ.3 లక్షల విరాళంతో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. సిద్దవటం మండలంలోని వెంకటాయపల్లి, పొన్నవోలు, పి.కొత్తపల్లి, చలమారెడ్డి కొట్టాలు, జ్యోతి గొల్ల ప్రజలు కడపకు వెళ్లాలంటే సిద్దవటం, మూలపల్లి గ్రామాల మీదుగా 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. దీంతో కడపకు అతి తక్కువ దూరంలో కడపకు వెళ్లేందుకు పెన్నానదిలో నీరు లేకపోవడంతో పి.కొత్తపల్లి ప్రభుత్వం ఆసుపత్రి వద్ద నుంచి ఆయా గ్రామాల ప్రజలు డబ్బులు వేసుకొని పెన్నానదిలో మట్టిరోడ్డును నిర్మించుకున్నారు.

స్టడీ క్యాంప్‌లో తపాలా ఉద్యోగులు


పుస్తక ఆవిష్కరణ సభలో తపాలా ఉద్యోగులు

రామాపురం : ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు చెందిన ఎన్ఎఫ్‌పీఈ స్టడీ క్యాంప్‌ను ఆదివారం విజయవాడలో నిర్వహించినట్లు కడప డివిజన్ సెక్రటరీ సుబ్బారెడ్డి, మండల పరిధిలోని తపాలా శాఖ ఉద్యోగి తాటిగుంట్ల మేఘనాధరెడ్డిలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫార్మర్ సెక్రటరీ జనరల్ కె.వి.శ్రీధరన్ తపాలాశాఖ నియమ నిబంధనలను వివరించడంతోపాటు పీఅండ్‌టీ ట్రేడ్ యూనియన్ హిస్టరీ పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, కడప మేయర్ సురేష్ బాబు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి కుమార్తె, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనీల్ కుమార్ రెడ్డి కుమారుని నిశ్చితార్థం ఆదివారం తిరుపతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ కె సురేష్ బాబు, ప్రభుత్వ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, చిట్వేలి మండలాధ్యక్షులు చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు, అధికారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సీఎఫ్‌సీ ప్రారంభం


సీఎఫ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఎస్‌వీకేఆర్ కాంప్లెక్స్‌లో కేఎఫ్‌సీ తరహాలో సీఎఫ్‌సీని ఆదివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ డి.రఘురాంరెడ్డి, సీఎఫ్‌సీ యజమానులు మదన్‌మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం సీఎఫ్‌సీ (ఎంఎం క్రిస్పీ ఫ్రైడ్ చికెన్, బర్గర్ కేఫ్)ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాపూజీ


బీజేపీ జిల్లా అధ్యక్షుడి సాయిలోకేష్‌తో బాపూజీ

చిట్వేలి : బీజేపీ చిట్వేలి మండల అధ్యక్షుడిగా నాగవరం వడ్డెపల్లికి చెందిన పుల్లంగంటి బాపూజీని ఆదివారం ఎంపిక చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ నాపై నమ్మకంతో తనను మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు పార్టీ బలోపేతానికి అహర్నిశలు పాటుపడతానన్నారు.

పెనగలూరు అధ్యక్షుడిగా మల్లికార్జున



పెనగలూరు (ఓబులవారిపల్లె) : బీజేపీ మండలశాఖ అధ్యక్షుడిగా మస్యం మల్లికార్జునను నియమించినట్లు బీజేపీ రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు అందాయి. మల్లికార్జున గతంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగాను, మండల కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగాను పనిచేశారు.

వైభవంగా గంగమ్మ 'పార్వేట' ఉత్సవం

- అనంతపురం గంగమ్మకు పార్వేట అమ్మవాస్య పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆలయాల్లో పూజలందుకున్న అమ్మవార్లు


లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక పూజలందుకుంటున్న అనంతపురం గంగమ్మ


లక్కిరెడ్డిపల్లె: అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. పార్వేట అమావాస్య మొదలుతో ఆలయ అర్చకత్వాన్ని ఆదిమూలం వంశీయులు నుంచి చెల్లు నారాయణ వంశీయులకు అప్పగించినట్లు ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్ర రాజు పేర్కొన్నారు. పార్వేట ఉత్సవం సందర్భంగా అర్చక వంశీయులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు. మొక్కుబడి ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. క్యూలైన్‌ల ద్వారా అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పింపజేసి అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. వేలాది మంది భక్తులు పార్వేట ఉత్సవానికి తరలిరావడంతో జాతర సందడి నెలకొంది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మార్చి 11, 12న జరుగబోవు గంగమ్మ జాతరకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలో రూ. 20 లక్షల పైబడి ఆలయ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయానికి సంబంధించిన 15.98 ఎకరాల భూమిని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల సహకారంతో అమ్మవారి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి రికార్డులు సిద్ధం చేసినట్లు ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, చైర్మన్ నరసింహారెడ్డిలు తెలియజేశారు. అమ్మవారి ప్రసాదం కోసం భక్తులు ఎగబడ్డారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరప్రదాయి.. దేవరరాయి

సంబేపల్లె : ఆదివారం రాయచోటి అన్నమయ్య జిల్లా సంబేపల్లెలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీ స్వామి, ఈఓ కొండారెడ్డి, గడికోట చంద్రశేఖర్ రెడ్డి అమ్మవారి సేవకులు భక్తులకు పూజ, వసతి సౌకర్యాల కల్పనపై పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

అమ్మవారిని విశ్రాంత డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి, చిన్న గొట్టిగల్లు సర్పంచ్ మనోహర్, కడప ఆర్టీఓ కార్యాలయ అధికారి లక్ష్మీకర్ రెడ్డి, కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. అమ్మవారి సన్నిధిలో కలకత్తాకు చెందిన ప్రభాత్ బాగ్చి ప్రత్యేక పూజలు చేయించి దేవరరాయిపై పార్లి మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన మల్లూరమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం కావడంతో ఆలయ అర్చకులు అమ్మవారిని అందంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.


చిన్నమండెం: అలంకరణలో మల్లూరమ్మ


సంబేపల్లె: భక్తులతో కిక్కిరిసిన నల్లగంగమ్మ ఆలయం

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


ప్రత్యేక అలంకారంలో కన్యకా పరమేశ్వరి

చిట్వేలి : వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని చిట్వేలి అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు పలు రకాల ఎండు పండ్లతో అమ్మవారి రూపాన్ని ఆలయ అర్చకులు, యువకులు రూపొందించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, అగ్నిహోమం, పూజలు నిర్వహించారు. తమ పవిత్ర దైవంగా భావించే వాసవీమాత ఆదిపరాశక్తి దేవి అవతారమని, స్త్రీలను రక్షించి, ధర్మాన్ని కాపాడేందుకు మానవ రూపేన జన్మించిందన్నారు. కన్యకగా గోదావరి నది ఒడ్డున బ్రహ్మకుండ పవిత్ర స్థలంలో అగ్నిలోకి దూకి ఆత్మార్పణ చేసుకుందని ఆలయ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కామిశెట్టి సుబ్రమణ్యం, కోట సుధాకర్, సదానందం, టివి సుబ్రమణ్యం, కామిశెట్టి సుమన్, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పాసులు పునరుద్ధరించాలి

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం బెంగళూరురోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని రైల్వేమంత్రికి వినతిపత్రాలు పంపించామన్నారు. మార్చి 10న దృష్టి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్న పాలకులు'


మాట్లాడుతున్న పౌరహక్కుల నేత క్రాంతిచైతన్య


జిల్లా మహాసభలకు హాజరైన ప్రజలు

రాయచోటి అర్బన్ : ప్రశ్నించే వారిని, పోరాడే వారి గొంతుకలను నొక్కడమే ధ్యేయంగా పాలకులు పనిచేస్తున్నారని పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త క్రాంతిచైతన్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో ఏపీసీఎల్‌సీ 11వ జిల్లా మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలపై పాలకుల జరుపుతున్న హింసను ప్రశ్నించేందుకే 1973 డిసెంబర్ 23న గుంటూరులో మహాకవి శ్రీశ్రీ అధ్యక్షతన పౌరహక్కుల సంఘం ఏర్పడిందన్నారు. ఎవరికి భయపడకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సంస్థ 50 వసంతాల కాలంలో ఎంతోమంది ఉద్యమనేతలను పోగొట్టుకుందన్నారు. ఏపీసీఎల్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ చట్టం ఉన్నది కేవలం, భూస్వాములు, పెట్టుబడిదారులు, పాలకులకు మాత్రమే కానీ పేదలకు ఏమాత్రం కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడం దారుణమన్నారు. ప్రజలకు మద్దతుగా నిలబడి మాట్లాడుతున్న మేధావులు, రచయితలు, హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులపై పాలకులు ఎస్ఐఏను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయించి జైళ్లలో మగ్గేటట్లు చేస్తున్నారన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సమస్యలను ఎత్తిచూపుతూ ప్రశ్నించే వారిపై పాలకులు దాడులకు పాల్పడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నాయంటూ మండిపడ్డారు. అనంతరం ఏపీసీఎల్‌సీ నేతలు మనోహర్‌రెడ్డి, రాయచోటి రవిశంకర్, సురేష్, రవిశంకర్, రెడ్డెయ్య, పుల్లయ్య, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ, ఝాన్సీలక్ష్మి, డీహెచ్‌పీఎస్ నేత సుధీర్, సీపీఐ విశ్వనాథనాయక్, బాస్ నేత పల్లం తాతయ్యతోపాటు పలు సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

ఈ సందర్భంగా ఏపీసీఎల్‌సీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడుగా పి.రెడ్డెయ్య, కోశాధికారిగా మనోహర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం.రవిశంకర్, కార్యవర్గ సభ్యులుగా పుల్లయ్య, మునెమ్మ, సి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి


అధ్యక్షుడిని ఘనంగా సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్ : బీసీలు రాజకీయంగా ఎదిగేలా మనందరం కలసికట్టుగా పని చేయాలని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దువ్వూరు నరసింహాచారి కోరారు. సోమవారం రాయచోటి పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో బీసీల చైతన్య వేదిక టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా బీసీలు వెనకబడి ఉన్నారని, రాజకీయంగా ఎదిగినప్పుడే మనం అన్ని రంగాల్లో ఎదుగుతామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే బీసీలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అలానే వారి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. నరసింహాచారిని ఘనంగా సన్మానించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరావు, వర్కింగ్ ప్రసిడెంట్ గోవింద్ సుధాకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులుగా పాలగిరి హబీబుల్లా, ఉపాధ్యక్షులు రమేష్, పురుషోత్తం, నాగేశ్వర, గౌరవ అధ్యక్షులు శివప్రసాద్ నాయుడు (గుట్టబాబు), సుబ్బరాజు యాదవ్‌లతోపాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సోమారపు నాగార్జున ఆచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల్లో నైపుణ్యం చూపాలి


పోటీల్లో తలపడుతున్న జట్లు

నందలూరు(రాజంపేట) : మన దేశీయ గ్రామీణ క్రీడల్లో ఒకటైన కబడ్డీ నేడు అంతర్జాతీయంగా ప్రాముఖ్యత పొందిందని సీనియర్ రిపోర్టర్ బూదేల ప్రభాకర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కాట్ గ్రూపు 25వ వార్షికోత్సవాలు సందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా ఆదివారం యువతకు కబడ్డీ పోటీలు జరిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ రిపోర్టర్ ప్రభాకర్, సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మిడిశెట్టి సుధాకర్‌లు పాల్గొని కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలలో మంచి నైపుణ్యం ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలకు చేరాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన కబడ్డీ పోటీలలో నందలూరు వైట్ క్యాట్ టీమ్ విజేతగా నిలిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కబడ్డీ టీమ్ రన్నర్స్‌గా నిలిచింది. ఎల్లటూరు శ్రీనివాసరాజు ప్రథమ బహుమతిని, కీ.శేలు బూదేల వెంకటయ్య, బి.సుబ్బమ్మ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ద్వితీయ బహుమతిని కుమారుడు ప్రభాకర్ అండ్ సన్స్ అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట సామ్రాజ్, స్కాట్ గ్రూప్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల అందజేత


ఆలయ కమిటీ సభ్యులకు ఉత్సవ విగ్రహాలను అందిస్తున్న దాత

గాలివీడు : వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల విగ్రహాల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని గేటు కోదండ రామాలయం నుంచి పెద్దూరు బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు గ్రామస్తులతో కలిసి గ్రామోత్సవాన్ని జరిపారు. మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం మార్చి 18, 19, 20వ తేదీలలో నిర్వహించనున్నారు. వివిధ దేవతా వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య కోలాటాలతో గ్రామోత్సవం ఘనంగా చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను దాత కరిమిరెడ్డి గారిపల్లె వాస్తవ్యులు రమణయ్య దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

జనం మెచ్చిన నేత సీఎం వైఎస్ జగన్


సినిమా థేయటర్ వద్ద పోస్టర్లతో ఐటీ వింగ్ సభ్యులు

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో జనం మెచ్చిన నేతగా పేరొందారని సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు పేర్కొన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని సాయి థియేటర్‌లో ప్రదర్శించబడుతున్న యాత్ర–2 చిత్రాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఐటీ వింగ్ సెక్రటరీ రమేష్ రెడ్డి, వైఐపీ రాయచోటి ఇన్‌చార్జ్ సెమిరెడ్డిల ఆధ్వర్యంలో 45 మంది టీమ్‌తో కలిసి చూశారు. వీరిలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి టీమ్ సభ్యులూ సినిమాను తిలకించారు. రాజకీయాలకు అతీతంగా సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని వారు కొనియాడారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం అనునిత్యం కష్టపడుతున్న జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా ఒదిగిపోయారన్నారు.

రాష్ట్రస్థాయి 'ఇన్‌స్పైర్' పోటీలకు ఎంపిక


ప్రశంసా ప్రత్రం అందుకుంటున్న జగన్‌మోహన్

సిద్దవటం : గత రెండు రోజులుగా బద్వేల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి నటువంటి ఇన్స్‌పైర్ మనక్ పోటీల్లో సిద్దవటానికి చెందిన శ్రీ నలంద హైస్కూల్ విద్యార్థి జగన్‌మోహన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని ఆ పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణస్వామి, పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జగన్‌మోహన్ అతి తక్కువ ఖర్చుతో మైక్రోస్కోప్‌ను ఎలా తయారు చేయవచ్చు ననే అంశంపై ప్రాజెక్టును రూపొందించారన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యిందన్నారు. ఈ మైక్రోస్కోప్ ద్వారా అతి సూక్ష్మమైనటువంటి జీవులను, వాటి ఆకారాలను, పత్రం అంతర్ నిర్మాణాలను, కణాల నిర్మాణాలను వాటి ఆకారాలను గుర్తించవచ్చని వారు తెలిపారు. జగన్‌మోహన్‌కు అధికారుల చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని షీల్డ్‌ను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణమ్మ, ఈశ్వరమ్మ, భార్గవి, అరుల్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

రామాపురం : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ గడికోట విజయలక్ష్మి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి సుమారు 180 మందికి పైగా రోగులు వైద్య సేవలను పొందారు. శస్త్రచికిత్సలకు 15 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలను అందిస్తామని వైద్యులు అంజనేయులు తెలిపారు. రోగులకు ఛార్జీలు, భోజనాలు, మందులు ఇస్తామని పేర్కొన్నారు. శిబిరంలో సింగల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, వైద్యులు వినయ్, సిబ్బంది యల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెలో సారా విక్రయాలు జరగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో స్థానికంగా సారా తయారుచేసి విక్రయిస్తున్న కే.వెంకటరమణనాయక్(55)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

తవళం దళితవాడలో..

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తవళం హరిజనవాడలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన ఇడగొట్టిరమణ(47) సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

సమస్యలపై పోరాడే సీపీఎంను ఆదరించండి


విరాళాల కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

ఒంటిమిట్ట : ప్రజా సమస్యలపై పోరాడి వాటిని పరిష్కారానికే తోడ్పడే సీపీఎంను ఆదరించాలని ఆపార్టీ మండల కార్యదర్శి కె. నరసయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ సోమశిల పైప్‌లైన్ నుంచి ఒంటిమిట్ట చెరువుకు నిరంతరం నీటి సరఫరా చేయాలని చెప్పారు. గ్రామీణ వలసలు నివారించడానికి పేదలకు మూడు ఎకరాలు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పనులు కల్పించి కూలి రూ. 600లు ఇవ్వాలని తెలియజేశారు. ఒంటిమిట్ట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఒంటిమిట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది దేవస్థానంలో ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రైతుల బోర్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్ బాబు, సాంబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులతో ఉపాధ్యాయులు, సిబ్బంది

సిద్దవటం : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సైకాలజిస్టు ఓ.వి.రెడ్డి తెలిపారు. మండలంలోని మాధవరం–1 గ్రామంలో ఉన్న హ్యాపీకిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఫేర్‌వెల్ డే వేడుకలు జరిగాయి. ఓ.వి. రెడ్డి మాట్లాడుతూ త్వరలో 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు వెళ్లేటప్పుడు అనవసర భయాలకు తావులేకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకొని పరీక్షల్లో ఉత్తీర్ణతను సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శివకుమారి, హెచ్ఎం శ్రీరాములు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న, పారిశ్రామిక వేత్త తాజుద్దిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్ వలి ఉరుసు ఉత్సవానికి ఆహ్వానం

వాల్మీకిపురం: స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలను దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎండీసీ డైరెక్టర్‌లను కలసి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలవతో సన్మానించారు. ఈ నెల 23వ తేది నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఫూ మొహియుద్దీన్, కమిటీ అధ్యక్షుడు సందాని బాషా, సభ్యులు షాహిద్, చికెన్ మస్తాన్, సాధిక్, బబ్లూ, సైఫుల్లా, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.